క్లుప్తంగా

కనుల పండువగా గోపాలుడి గ్రామోత్సవం



గ్రామోత్సవం నిర్వహిస్తున్న త్రైత సిద్ధాంత సభ్యులు

కొలిమిగుండ్ల: త్రైత సిద్ధాంతం, ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కొలిమిగుండ్లలో నిర్వహించిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు బుధవారంతో ముగిశాయి. స్థానిక లలితా సుందరేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని కొలువుదీర్చి పది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు ప్రత్యేక పల్లకీలో స్వామి ఉత్సవ విగ్రహాన్ని కొలువు దీర్చి మేళతాళాలు, భక్తుల జై శ్రీకృష్ణ నినాదాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంత సభ్యులు బాబు, నవీన్, మహ్మద్ హుసేన్‌నాయుడు, హరి, అశోక్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలకు చెత్త బుట్టలు మంజూరు



బుట్టలను కార్యాలయంలో భద్రపరుస్తున్న సిబ్బంది

కొలిమిగుండ్ల: తడి, పొడి చెత్త సేకరణ కోసం గ్రామ పంచాయతీలకు 22 వేల చెత్త బుట్టలు మంజూరైనట్లు ఈఓఆర్డీ శ్రీహరి తెలిపారు. లారీలో వచ్చిన బుట్టలను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని మీటింగ్ హాల్‌లో భద్రపరిచారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రస్తుతం 80 శాతం బుట్టలు వచ్చాయని, మిగిలిన 20 శాతం త్వరలో వస్తాయన్నారు. గ్రామాల్లో చెత్త సేకరణ కోసం ఒక్కో కుటుంబానికి రెండు చెత్త బుట్టలు త్వరలో పంపిణీ చేస్తామని ఆయన పేర్కొన్నారు.

శ్రీకృష్ణ భగవద్గీత కమిటీ ఎన్నిక

డోన్ టౌన్: హిందూ ధర్మ పరిరక్షణ కోసం భగవద్గీతను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కమిటీని ఏర్పాటు చేసినట్లు కార్యవర్గ నిర్వాహకుడు జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టి తెలిపారు. పట్టణంలోని గాయత్రీ పీఠంలో బుధవారం జరిగిన సమావేశంలో గౌరవ అధ్యక్షుడిగా శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ, అధ్యక్షుడిగా సప్తశైల తిమ్మయ్యను ఎన్నుకున్నారు. అలాగే ఉపాధ్యక్షుడిగా తొగట సురేష్‌బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎలుకూరి నరేష్, కన్వీనర్‌గా జొన్నలగడ్డ శ్రీనివాసుల శెట్టిని ఎన్నుకున్నారు.

ఉపాధ్యాయులే మార్గదర్శకులు



సత్కారం పొందిన ఉపాధ్యాయులతో అధికారులు

డోన్ టౌన్: విద్యా బుద్ధులతో ఆదర్శ సమాజంగా తీర్చిదిద్దేది ఉపాధ్యాయులేనని తహసీల్దార్ నాగమణి అన్నారు. గురుపూజోత్సవం సందర్భంగా పట్టణంలోని షాదిఖానాలో ఉపాధ్యాయులకు సత్కారం, రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ ఉపాధ్యాయునిగా చేసిన సేవ గురించి వివరించారు. అనంతరం ఉపాధ్యాయులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. ఎంఈఓలు ప్రభాకర్, రామనర్సప్ప, ప్రధానోపాధ్యాయులు తొగట సురేష్‌బాబు, వెంకటసుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణ, మౌలాలి, బాబు, విద్యార్థి నేత విజయ్‌కుమార్, మాణిక్యంశెట్టి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డోన్ టౌన్: పేరంటాలమ్మ గుడి సబ్‌స్టేషన్ పరిధిలోని హైవే ఫీడర్ కింద పోల్స్ ఎరెక్షన్ కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కోట్ల నగర్, వెంకటాపురం సర్కిల్, ఎన్‌హెచ్ 44 ప్రాంతాలతో పాటు లక్ష్మంపల్లి, మల్లెంపల్లె గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ నాగేశ్వరరెడ్డి తెలిపారు. రైతులకు ఇచ్చే త్రీఫేస్ కరెంటు గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి 10 గంటల వరకు మళ్లీ మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ఇస్తామని పేర్కొన్నారు.

ఉమేష్ చంద్రను ఆదర్శంగా తీసుకోవాలి

డోన్ టౌన్: ప్రతి పోలీసు ఐపీఎస్ అధికారి చదలవాడ ఉమేష్ చంద్రను ఆదర్శంగా తీసుకుని సప్రజలకు సేవలు అందించాలని రూరల్ సీఐ రాకేష్ అన్నారు. ఉమేష్ చంద్ర వర్ధంతిని పురస్కరించుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఆయన చిత్ర పటానికి నివాళులర్పించారు. పోలీసు ఉన్నతాధికారిగా ఆయన చూపిన ధైర్య సహాసాలను వివరించారు. విధి నిర్వాహణలో దుండగుల చేతిలో తూటాలకు అమరుడయ్యారని తెలిపారు.

సామాన్య రైతు కుటుంబంలో పుట్టి




డోన్ నియోజకవర్గం బేతంచెర్ల మండలం అంబాపురం గ్రామానికి చెందిన కొప్పెట శ్రీనివాస రెడ్డి సామన్య రైతు కుటుంబంలో పుట్టారు. ఎమ్మెస్సీ, పీహెచ్‌డీ పూర్తి చేశారు. 2012లో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేసి కొంతకాలం తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా ఆత్మకూరు, కర్నూలులో పనిచేశారు. ప్రస్తుతం డోన్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కెమిస్ట్రీ లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. కళాశాలలో వంద శాతం అడ్మిషన్లు జరిగేందుకు కృషి చేయడంతో పాటు కెమిస్ట్రీ సబ్జెక్టులో ఉత్తమ ఫలితాలు సాధించినందుకు ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేసింది.

చదివిన పాఠశాలలోనే పీడీగా లూదమ్మ



డోన్ పట్టణంలోని రైల్వే కాలనీకి చెందిన లూదమ్మ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా చేరి అనంతరం ఫిజికల్ డైరెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచేందుకు విశేష కృషి చేశారు. విశేషమేమిటంటే ఒకటి నుంచి పదో తరగతి వరకు ఇదే స్కూల్‌లో ఈమె విద్యను అభ్యసించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, డిగ్రీ కళాశాలలో బీఏను పూర్తిచేసి ఎంఏ (ఇంగ్లీష్)ను ఎస్కే యూనివర్సిటీలో పూర్తి చేశారు. బీఈడీని కర్నూలులోని సెయింట్ థెరిస్సా కళాశాలలో చదివారు. తాను చదివిన పాఠశాలలోనే పనిచేస్తూ ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడంపై హర్షం వ్యక్తం చేశారు.

తెలుగులో రారాజు.. నాగరాజు



బేతంచెర్ల మండలం శంకరాపురం గ్రామానికి చెందిన గంగుల నాగరాజు ఎంఏ, బీఈడీ, పీహెచ్‌డీ ఎస్వీ యూనివర్సిటీలో పూర్తి చేశారు. గోరుమానుకొండ సమీపంలోని ఏపీ మోడల్ స్కూల్ తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం నిరంతరం పనిచేయడమే కాకుండా సాహిత్యం, సాంఘిక జీవితంలో మార్పు కోసం రచనలు చేస్తూ అష్టావధానిగా కొనసాగుతున్నారు. ప్లిలలకు సైతం కవితలు, పద్యాలు నేర్పిస్తున్నారు. గ్రామీణ పిల్లలను ప్రోత్సహించడానికి ప్రత్యేక చొరవ తీసుకుంటూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

ఆచార్యదేవోభవ

మాతృదేవోభవ.. పితృదేవోభవన.. ఆచార్యదేవోభవ అంటాం. ఎందుకంటే తల్లిదండ్రులు జన్మనిస్తే గురువులు విద్యా బుద్ధులు నేర్పించి మన జీవితం ఉన్నతంగా ఉండేలా తీర్చిదిద్దుతారు. అలాంటి వారిని గౌరవించుకోవడం మన బాధ్యత. సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఏటా ఉత్తమ ఉపాధ్యాయులను గుర్తించి సత్కరిస్తారు. ఈ ఏడాది బనగానపల్లె, డోన్ నియోజకవర్గాల నుంచి 19 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యాభివృద్ధికి వారు చేసిన కృషి.. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక కావడంపై వారి అభిప్రాయాలు..

- ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక
- ఉత్తమ సేవలకు గుర్తింపు
- డోన్, బానగానపల్లె నియోజకవర్గాల నుంచి 19 మందికి పురస్కారాలు
- నేడు అవార్డులు అందుకోనున్న గురువులు

ఉత్తమ ఉపాధ్యాయులు

బేతంచెర్ల	-3.	ప్యాపిలి	-1
డోన్	-2.	బనగానపల్లె	-7
కొలిమిగుండ్ల	-4.	అవుకు	-2
మొత్తం	-19		

డోన్: దివంగత రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది.

ఇందులో భాగంగా ఈ ఏడాది జిల్లాలో అత్యుత్తమ సేవలందించిన పలువురు పాఠశాల ఉపాధ్యాయులు, జూనియర్ కళాశాల లెక్చరర్లను ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేసి సత్కరించనుంది.

సంతోషంగా ఉంది



ఉత్తమ ఉపాధ్యాయినిగా ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రస్తుతం ఏనుగుమర్రి ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధిస్తున్నాను. గతంలో జలదుర్గం ఉన్నత పాఠశాలలో పని చేస్తున్నప్పుడు విద్యార్థుల ద్వారా చేయించిన ప్రాజెక్టుకు రాష్ట్ర స్థాయిలో ప్రశంసలు వచ్చాయి. తర్వాత జాతీయ స్థాయిలో కూడా విద్యార్థులు పలు ప్రాజెక్టులు చేసి మన్ననలు పొందారు. ఏనుగుమర్రిలో విద్యార్థులకు సైన్సు బోధిస్తూ వారికున్న సందేహాలను నివృత్తి చేస్తున్నాను. ఫిజిక్స్‌పై విద్యార్థులకు ఆసక్తి కలిగేలా బోధిస్తూ వారిని సైంటిస్టులుగా ప్రోత్సహించాలన్నదే నా ధ్యేయం.

–షకీల సోని, ఫిజిక్స్ టీచర్, ఏనుగుమర్రి, ప్యాపిలి

అదనపు తరగలు నిర్వహిస్తున్నా



నా తల్లితండ్రులు, గురువుల ప్రోత్సాహంతో 22 ఏళ్ల క్రితం ఉపాధ్యాయ వృత్తి చేపట్టాను. ప్రభుత్వ పాఠశాలకు వచ్చే పేద విద్యార్థుల కోసం ప్రతి రోజు నాకున్న తరగతులతో పాటు ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నాను. విద్యార్థులను ఉన్నత స్థానంలో నిలబెట్టడానికి కృషి చేయడంతో ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యాను. నాపై బాధ్యత మరింత పెరిగింది.

– పి. లక్ష్మీదేవి, పాణ్యం సిమెంట్ హైస్కూల్, బేతంచెర్ల

ఉత్తమ విద్యా బోధనే లక్ష్యం



విద్యార్థులకు ఉత్తమ విద్యా బోధన చేయడమే ప్రధాన లక్ష్యం. ఎస్జీటీగా 27 ఏళ్లుగా ఎంతో మంది విద్యార్థులకు చదువు చెప్పాను. ప్రభుత్వాలు విద్యార్థుల భవిష్యత్తు, వారి ఆరోగ్యం కోసం చేసే ప్రతి కార్యక్రమంలో వారిని భాగస్వాములను చేసి అవగాహన కల్పిస్తున్నాను. చెడు అలవాట్లకు కారణాలు, వాటి వల్ల కలిగే దుష్పరిణామాలపై విద్యార్థులకు అవగాహన కల్పించడం వంటి మంచి పనులు చేయడంతో అధికారులు గుర్తించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేశారు.

–లక్ష్మీనారాయణరెడ్డి, ఎంపీపీ పాఠశాల, గోకులదిన్నె, అవుకు

చదువుకు ఎవరూ దూరం కాకూడదు



ఎవరూ చదువుకు దూరం కాకూడని గ్రామాల్లో బడిబయట ఉన్న పిల్లలను పాఠశాలలో చేర్పించేందుకు కృషి చేశాను. పచ్చదనం, పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాం. వంద శాతం ఎన్‌రోల్‌మెంట్ కోసం పనిచేశాను. అవార్డు రావడం సంతోషంగా ఉంది. మరింత బాధ్యత పెంచింది.

–ముకుందారెడ్డి, ఎస్జీటీ, బత్తులూరుపాడు, బనగానపల్లె

గుర్తింపు లభించింది



జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉంది. ఉపాధ్యాయుడిగా మంచి గుర్తింపు లభిస్తుంది. విద్యార్థులను తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తాను. అవార్డు మానసిక బలాన్ని చేకూర్చింది.

–ప్రసాదరావు, హెచ్ఎం, బిలుం ఉన్నత పాఠశాల

సర్వీసు ఎక్కువ భాగం ఇక్కడే



ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయురాలిగా నా సర్వీసు ఎక్కువ భాగం కొలిమిగుండ్ల మండలంలోనే కొనసాగింది. అంకిరెడ్డిపల్లె, కొలిమిగుండ్ల, కనకాద్రిపల్లె ఉన్నత పాఠశాలల్లో పని చేశాను. సైన్స్‌లో విద్యార్థులను తీర్చిదిద్ది జిల్లా స్థాయి సైన్స్‌ఫేర్లలో పాల్గొనేలా తయారు చేశాం. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దక్కడం సంతోషకరంగా ఉంది.

–విజయ ప్రసన్న, చింతలాయిపల్లె ఉన్నత పాఠశాల

బాధ్యత పెంచింది



ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు మరింత బాధ్యత పెంచింది. ఏడాది క్రితమే స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై ఇక్కడికి వచ్చాను. పాఠశాలలో చేరగానే ఇటీవలనే హిందూ సంస్కృతి సభ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డు తీసుకున్నాను. ఇప్పుడు జిల్లా స్థాయి అవార్డు అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. సమాజంలో ఉపాధ్యాయులకు ప్రత్యేక గుర్తింపు ఉంది.

–బాల నరసింహారెడ్డి, కొలిమిగుండ్ల ఉన్నత పాఠశాల

మొదటి సారి అవార్డు అందుకుంటున్నాను



అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో 2019 నుంచి పని చేస్తున్నాను. మొదటి సారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం గర్వకారణంగా ఉంది. ఇంత కంటే ఆనందం మరొకటి ఉండదు. గతంలో స్వచ్ఛంద సంస్థల నుంచి అవార్డులు తీసుకున్నాను. తెలుగు ఉపాధ్యాయుడిగా విద్యార్థులను మంచి ప్రావీణ్యులుగా చేసేందుకు కృషి చేస్తాను.

–ఎల్లా సుబ్బయ్య, అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల

సంతోషంగా ఉంది



పాఠశాల అభివృద్ధికి గ్రామంలోని దాతల నుంచి విరాళాలు సేకరించి విద్యార్థులకు నోటుపుస్తకాలు, బ్యాగులు, దుస్తులు అందించడం బాధ్యతగా తీసుకున్నాను. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు ప్రతిభ చాటేందుకు కృషి చేశాను. ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం. దేశభక్తి, సామాజిక సేవపై పిల్లలకు తెలియజేస్తూ వారిలో ప్రేరణ కలిగిస్తున్నాను. అవార్డు దక్కడం గౌరవంగా భావిస్తున్నాను.

–విజయ, ఎస్జీటీ, యనకండ్ల, బనగానపల్లె

తల్లికి వందనం ఎప్పుడిస్తారు..?

- యూరియా కొరత తీర్చండి
- మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల ధ్వజం



విద్యుత్ సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి

కోవెలకుంట్ల: తల్లికి వందనం పథకం ద్వారా ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి రూ. 15 వేల చొప్పున అందజేస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీ ప్రకటించిందని, అధికారం చేపట్టి మూడు నెలల కావస్తున్నా ఇప్పటి వరకు ఆ పథకాన్ని అమలు చేయలేదని మండల కో–ఆప్షన్ మెంబర్ దిల్కెబాషా ఆరోపించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. విద్యాశాఖపై చర్చకు రాగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం ద్వారా ఏటా తల్లుల ఖాతాల్లో రూ.15 వేల చొప్పున అందించేవారని.. ప్రస్తుత ప్రభుత్వం ఆ పథకాన్ని అమలు చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువుకు దూరం అవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో బాలికలపై లైంగిక దాడులు అధికమయ్యాయని, బాలికల ఆత్మరక్షణ కోసం పాఠశాలల్లో కరాటే నేర్పించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎంపీటీసీలకు తొమ్మిది నెలల నుంచి గౌరవ వేతనాలు అందడం లేదని, కూటమి ప్రభుత్వం వేతనాలు విడుదల చేయాలన్నారు. వ్యవసాయ రంగంపై చర్చకు రాగా ప్రస్తుతం వరినాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని, యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఎంపీపీ రమాదేవి, కలుగొట్ల ఎంపీటీసీ అబ్దుల్ సత్తార్ సభలో ప్రస్తావించారు. మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ.. మరో రెండు, మూడు రోజుల్లో రైతు సేవా కేంద్రాలకు యూరియా చేరుతుందని తెలిపారు. విద్యుత్ శాఖపై చర్చకు రాగా మండలంలోని బిజనవేముల, అమడాల బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారని, విద్యుత్ వైర్లు అమర్చకపోవడంతో ఆయా కాలనీ వాసులు రాత్రి వేళల్లో కరెంట్ లేక అవస్థలు పడుతున్నారని ఎంపీపీ, సర్పంచ్ బాలమద్దిలేటి సభ దృష్టికి తెచ్చారు. కలుగొట్ల గ్రామంలో ట్రాన్స్‌ఫార్మర్లు చిన్న పిల్లలకు అందే ఎత్తులో ఉన్నాయని, చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. ట్రాన్స్‌కో ఏఈ రామమోహన్ మాట్లాడుతూ.. కొత్తగా విద్యుత్ స్తంభాలు, వైర్ల ఏర్పాటుకు గ్రామ పంచాయతీ తీర్మానం చేసి ప్రతిపాదిస్తే ఉన్నతాధికారులకు నివేదిస్తామని, గ్రామ పంచాయతీలు విద్యుత్ స్తంభాలు, వైర్లకు డబ్బులు చెల్లిస్తే ఏర్పాటుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. ఎంపీడీఓ సయ్యదున్నీసా, తహసీల్దార్ పవన్‌కుమార్ రెడ్డి, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి, ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య, ఏఈ హరీష్ పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన శివారెడ్డి

డోన్ రూరల్: మిడుతూరు మండలం కడుమూరు గ్రామానికి చెందిన శివారెడ్డి(65) స్థానిక రైల్వేస్టేషన్‌లో ప్రమాదవశాత్తూ కాలు జారి రైలు కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు.. మంగళవారం మధ్య రాత్రి యాగంటి నుంచి డోన్ మీదుగా కర్నూలుకు రైలులో బయలుదేరాడు. డోన్‌లో రైలులో నుంచి కాలు జారి కిందపడ్డాడు. ప్యాసింజర్‌లు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడకి చేరుకుని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. మృతుడి వద్ద ఉన్న ఆధార్ కార్డును పరిశీలించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, పోస్ట్‌మార్టం అనంతరం మృతదేహాన్ని అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.

నిమజ్జన ఘాట్ పరిశీలన



ఘాట్ పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

డోన్ టౌన్: వినాయక విగ్రహాలను నిమ్మజ్జనం చేసే వెంకటాపురం చెరువును పట్టణ, రూరల్ సీఐలు ఇంతియాజ్ బాషా, రాకేష్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి బుధవారం పరిశీలించారు. నీటి మట్టం, రూట్ మ్యాప్, వాహనాల పార్కింగ్ తదితర వాటిని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ప్రశాంతంగా నిమ్మజ్జనం చేసుకోవాలని సూచించారు. అగ్నిమాపక అధికారి రాజు, మున్సిపల్ పారిశుద్ధ్య విభాగం అధికారి మహబూబ్ బాషా, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఫణిరాజ్, హరికిషన్ ఉన్నారు.

ప్రశాంతంగా జరుపుకోవాలి

వినాయక చవితి ఉత్సవాలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని తహసీల్దార్ నాగమణి, సీఐ ఇంతియాజ్ బాషా సూచించారు. బుధవారం స్థానిక షాదిఖానాలో ఉత్సవ నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. పండుగ నిర్వాహణపై చర్చించి పలు అంశాలపై సూచనలు, సలహాలు ఇచ్చారు.

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



మహబూబ్ బాషా మృతదేహం

బనగానపల్లె రూరల్: మండలంలోని రామతీర్థం గ్రామంలో ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వలో గల్లంతైన మహబూబ్ బాషా(45) మృతదేహం అచూకీ లభ్యమైనట్లు నందివర్గం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐ వెంకట సుబ్బయ్య బుధవారం తెలిపారు. ఈ నెల 2వ తేదీ ఎస్సార్‌బీసీ ప్రధాన కాల్వ సమీపంలో ఉన్న పొలం వద్దకు వెళ్తూ కాలు జారి కాల్వ నీటిలో గల్లంతయ్యాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు గల్లింపు చర్యలు చేపట్టి నందవరం గ్రామ సమీపంలో మృతదేహం లభ్యమైంది. పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. భార్య మాసుంబీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

–నలుగురిపై కేసు

కోవెలకుంట్ల: పెళ్లయిన ఏడాదిన్నరకే అదనపు కట్నం తేవాలని వేధింపులకు గురి చేస్తుండడంతో బాధితురాలు బుధవారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి సమాచారం మేరకు.. కోవెలకుంట్ల పట్టణంలోని సంతపేటకు చెందిన సుధారాణి అదే పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన విజయ్‌కుమార్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. వివాహ సమయంలో కట్న కానుకలు ఇచ్చారు. కొద్ది రోజుల నుంచి భర్తతోపాటు అత్త వెంకటలక్ష్మి, మరిది అజయ్, తోడికోడలు అదనపు కట్నం కోసం వేధిస్తుండడంతో పుట్టింటికి చేరుకుంది. పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త, అత్త, మరిది, తోడికోడలిపై 498 ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన చాకలి చిన్న అంకాలు

అవుకు: మండల పరిధిలోని సంగపట్నం గ్రామానికి చెందిన యువకుడు బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చాకలి చిన్న అంకాలు(31) మద్యానికి బానిసై భార్య లక్ష్మీతో తరచూ గొడవపడేవాడు. మద్యానికి నగదు ఇవ్వాలని భార్యనే వేధించేవాడు. బుధవారం నగదు ఇవ్వడానికి ఆమె నిరాకరించడంతో పేడరంగు పొడర్‌ను నీటిలో కలుపుకుని సేవించాడు. వాంతులు చేసుకోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు అవుకు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

కారు ఢీకొని స్కూటరిస్టుకు గాయాలు

డోన్ టౌన్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో వ్యక్తికి గాయపడిన ఘటన పట్టణ సమీపంలోని జాతీయ రహదారి 44పై బుధవారం చోటుచేసుకుంది. మండలంలోని సీసంగుంతల గ్రామానికి చెందిన రైతు అనంతయ్య కురగాయాలు తీసుకుని జాతీయ రహదారిపై ఉన్న కోట్ల విజయభాస్కర్‌రెడ్డి కూరగాయల మార్కెట్‌కు బైక్‌పై వెళుతుండగా మ్యాక్స్ ఫోర్ హోటల్ వద్ద వెనుక వస్తున్న కారు ఢీకొనడంతో గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా వెంబడించి కారును పట్టుకున్నారు. డ్రైవర్‌ను విచారిస్తున్నారు.

కర్ణాటక మద్యం విక్రేత అరెస్ట్

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట గ్రామంలో మద్యం విక్రయిస్తున్న బుడిగి నాగరాజును అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్‌ఐ లింగమయ్య తెలిపారు. అతని వద్ద నుంచి 83 కర్ణాటక టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఉత్తమ అవార్డులకు ఎంపికైన మరికొందరు ఉపాధ్యాయులు

బషీర్ అహ్మద్	పీజీటీ	ఏపీఎంఎస్, అవుకు
శ్రీనివాసులు	జూ.లెక్చరర్	ప్రభుత్వ కళాశాల, డోన్
రామచంద్రారెడ్డి	ఎస్ఏ	జెడ్పీహెచ్ఎస్, కొత్తపేట
మహమ్మద్‌రఫీ	ఎస్ఏ	జెడ్పీహెచ్ఎస్, పలుకూరు
హరినాథ్‌గౌడ్	ఎస్ఏ	జెడ్పీహెచ్ఎస్,టంగుటూరు
ప్రతాప్	పీఎస్‌హెచ్ఎం	ఎంపీపీస్కూల్, తెలుగుపేట
శ్రీనివాసులు	ఎస్జీటీ	ఎంపీపీస్కూల్, గోరుమానుకొండ
బలగంగాధర్‌రెడ్డి	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, బనగానపల్లె